క్లుప్తంగా

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

జమ్మికుంట: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలోని శ్మశానవాటిక నిర్మాణం, సమీకృత మార్కెట్ పనులు, దుబ్బమల్లికార్జున స్వామి ఆలయం పరిధిలోని ట్రీపార్క్, డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కల పెంపకం, చెత్త చెదారం సేకరణ, చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడం వంటి పనులను సక్రమంగా నిర్వహించాలన్నారు. విధులపై అలసత్వం ప్రదర్శిస్తేచర్యలు తీసుకుంటామని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎన్వీరాన్మెంట్ ఇంజినీర్ శ్రీకాంత్, శానిటరీ ఇన్స్పెక్టర్ సదానందం సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి హోదా కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

చిగురుమామిడి: రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, బిల్‌కలెక్టర్లకు పంచాయతీ కార్యదర్శి హోదా కల్పించి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్‌కు నిరవధిక సమ్మె నోటీసులు అందించినట్లు రాష్ట్ర కారోబార్స్, సిబ్బంది యూనియన్ ప్రధానకార్యదర్శి, చిగురుమామిడి మండలంలోని కొండాపూర్ జీపీ కారోబార్ బింగి గణేశ్ తెలిపారు. బుధవారం ఆయన చిగురుమామిడిలో మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. కనీస వేతనంతో పాటు తమకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో మే5నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు పంచాయతీరాజ్ కమిషనర్‌కు వినతి పత్రం అందించామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్, గౌరవాధ్యక్షుడు లక్ష్మయ్య ఉన్నట్లు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వీడాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ లలితాదేవి

హుజూరాబాద్‌రూరల్: వైద్యసిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వీడాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి అన్నారు. బుధవారం మండలంలోని చెల్పూర్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణప్రాంతాల్లోని మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కొత్తగా ఆరోగ్య కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని పీహెచ్‌సీలో పకడ్బందీగా అమలుచేయాలన్నారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గదులను పరిశీలించి అనంతరం సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. గర్భిణులకు అందిస్తున్న న్యూట్రీషియన్ కిట్ల కోసం గదిని సిద్ధంచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా హెల్త్‌ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ చలం, ఫార్మసిస్ట్ బాపన్న, ల్యాబ్ టెక్నీషియన్ చిన్న, స్టాఫ్‌నర్స్ అరుణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా భారీ వృక్షాలు..

- పట్టించుకోని అధికారులు
- ఎప్పుడు ఏ చెట్టు కూలుతుందో తెలియని పరిస్థితి
- రహదారి వెంట ప్రయాణించేందుకు జంకుతున్న వాహనదారులు
- ప్రమాదకర చెట్లు తొలగించాలని ప్రయాణికుల విన్నపం



రహదారిపై ప్రమాదకరంగా ఉన్న భారీ వృక్షాలు

రామడుగు: కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిలో రామడుగు మండలం వెదిర గ్రామశివారులో కోనరావుపేట వద్ద రహదారిపై భారీ వృక్షాలు ప్రమాదకరంగా ఉన్నాయి. 60 ఏళ్లక్రితం నాటిన చెట్లు కావడంతో అవి ఎప్పుడు పడిపోతాయో తెలియక అయోమయం నెలకొంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు నిత్యం జంకుతున్నారు.

గతంలో...

గతంలో ఈ రహదారిపై భారీ వృక్షాలు కూలడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. చెట్టు కొమ్మలు అకస్మాత్తుగా మీదపడడంతో ఆర్టీసీ డ్రైవర్ ప్రాణాలు కోల్పోయిన ఘటన నెలకొంది. అలాగే బైక్‌లను తీసుకొస్తున్న భారీ కంటెనర్‌పై చెట్టుపడడంతో వాహనంలోని బైకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గతేడాది రాత్రిపూట భారీ వృక్షం కూలి రోడ్డుపై పడడంతో రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇలాంటి ఘటనలు అనేకం ప్రతి ఏడాది జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు.

కొమ్మలు తొలగించాలి...

ఈ రహదారివెంట చెట్లకొమ్మలు రహదారిని కమ్మేస్తుండడంతో పాటు గాలివానలు వచ్చినప్పుడు కొమ్మలు విరిగి రహదారిపై పడుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం చూడాల్సి వస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

మా బావివద్ద పెద్దచెట్టు పడింది



గతేడాది మా కరెంటు బావి వద్ద సాయంత్రం పెద్దచెట్టు ఒక్కసారి కూలింది. ఆ సమయంలో ఏ వాహనం రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. భారీవృక్షాలు గాలి వానలకు కూలిపోతున్నాయి. అధికారులు చెట్టు కొమ్మలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

– వంచ సత్యనారాయణరెడ్డి, రైతు, వెదిర

ఆలయాల పరిరక్షణకు చేయూత నివ్వాలి



గొడుగు వితరణ చేస్తున్న దంపతులు

జమ్మికుంట: ఆలయాల పరిరక్షణ భక్తులు, పురప్రముఖులు చేయూతనివ్వాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అనుమాస రేణుకాదేవి రాజేందర్ దంపతులు పట్టణంలోని 12 ప్రధాన ఆలయాలకు రూ.1.55 లక్షల విలువైన 12 గొడుగులను రాజేశ్వర్‌రావు, ప్రధాన అర్చకులు ఉదయగిరి కృష్ణమూర్తిశర్మ, డింగరి హరి కృష్ణమాచార్యులు చేతులమీదుగా ఆలయకమిటీ అధ్యక్షుడు ముక్క జితేంద్రగుప్తా, పురోహితులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పురాతన ఆలయాలను మనమందరం పరిరక్షించుకోవాలని సూచించారు. 12 ఆలయాలకు స్వామివారి సేవకు ఉపకరించే గొడుగులు అందిండంపై దంపతులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ దేశిని కోటి స్వప్న, ప్రముఖ వ్యాపారి ముక్క శివన్న, సిరిమల్ల జయేందర్, ముక్క నారాయణ, ప్రభాకర్, వీర్రాజు, మనోహర్‌రావు అర్చకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కల్పన

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న 'కంటివెలుగు' వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌కల్పన, పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సనాజవేరియా అన్నారు. బుధవారం మండలంలోని మాచనపల్లిలో 'కంటివెలుగు' శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి సమస్యలు ఉన్నావారు పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ శిబిరం మే 5వ తేదీ వరకు కొనసాగుతుందని శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పోల్సాని రాజేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ వేల్పుల శ్రీకాంత్, క్యాంప్ మెడికల్ ఆఫీసర్ మౌనిక, సూపర్‌వైజర్ స్వరూప, ఆరోగ్యశాఖ సిబ్బంది సావిత్రి, రజిత, నరేందర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ధరలు పెంచాలని బంద్ పిలుపు



ర్యాలీలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

జమ్మికుంట: ముడిసరుకులు, రవాణా ఖర్చులు అధిక భారం అవుతున్నాయని, పని ధరలు పెంపునకు విశ్వకర్మ కార్పెంటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించే బంద్ విజయవంతం చేయాలని అసోసియేషన్ మండల అధ్యక్షుడు సురాచారి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో విశ్వకర్మ కార్పెంటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. రెండురోజులు పనులు బంద్ చేస్తున్నామని, కార్పెంటర్ అసోసియేషన్ సభ్యులు, ప్లేవుడ్, హార్డ్‌వేర్ షాపుల యాజమానులు, కస్టమర్లు సహకరించాలని కోరారు. సంఘానికి వ్యతిరేకంగా పనిచేస్తే సంఘం తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారని ప్రతి సభ్యుడు నిబంధనలకు కట్టుబడి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కైరోజు రాజమొగిలి, ఉపాధ్యక్షుడు ఉమ్మడి సంపత్, కోశాధికారి ధరణి సంపత్‌చారి, శ్రీనివాస్, రాజుచారి సభ్యులు పాల్గొన్నారు.

కుడి చెరువులోకి నీరు విడుదల చేస్తాం

చొప్పదండి: రజకుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని, పట్టణంలో రజకసంఘం భవన నిర్మాణానికి రూ. 10లక్షల నిధులు కేటాయించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. పట్టణ శివారులోని మడేలయ్య గుడిలో బుధవారం పట్నాల ముగింపు కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టణ శివారులోని కుడిచెరువులోకి నీరు విడుదల చేయాలని స్థానిక రైతులు కోరగా, వెంటనే ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడారు. డీ87 కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, రజక సంఘం నాయకులు చీకటి కుమారస్వామి, నిజాన పురం చందు, మావురం రాములు, పొన్నాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

'భట్టి' పాదయాత్ర విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

హుజూరాబాద్ : సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పీపుల్స్ మార్చ్ ఈ నెల 20న హుజూరాబాద్ నియోజకవర్గానికి చేరుకుంటుందని నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై పాదయాత్రలో నిలదీయనున్నట్లు తెలిపారు. దళిత బంధు పథకం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన నియోజకవర్గంలో దళిత బంధు పథకంలో ఉన్న అవినీతి,అక్రమాలపై చర్చించనున్నట్లు తెలిపారు. పాదయాత్రలో కాంగ్రెస్ అన్ని విభాగాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాల విద్యాభివృద్ధికి సర్పంచ్ తోడ్పాటు

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రతీరోజు సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల సమయంలో ముగ్గురు విద్యావలంటీర్లను నియమించి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మూడు నెలలుగా సర్పంచ్ వెంకటేశం విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నాడు. వీరికి ప్రతినెలా రూ.18 వేలు చొప్పున వేతనాలను సర్పంచ్ స్వతహాగా అందిస్తున్నారు. ఈక్రమంలో బుధవారం ఎస్ఎంసీ చైర్మన్ మంద శ్రీనివాస్ చేతుల మీదుగా వేతనాలు అందించారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థులను సర్పంచ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోలారాంచంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దళిత వాడల్లో ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి

వీణవంక: దళితవాడల్లో కరెంట్ బిల్లులు కట్టాలని వేధిస్తున్నారని దళితులకు ఉచితంగా కరెంట్ సరఫరా చేయాలని కాంగ్రెస్ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండీ.సాహెబ్‌హుస్సేన్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఉచిత విద్యుత్ అమలుచేస్తే ఇప్పుడు తెలంగాణ ఏర్పడిన తర్వాత దళిత వాడలకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నారని మండిపడ్డారు. దళితులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వెంటనే కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



జంగపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

హుజూరాబాద్‌రూరల్/గన్నేరువరం/జమ్మికుంట/గంగాధర/ఇల్లందకుంట/శంకరపట్నం/సైదాపూర్ హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాల్లో బుధవారం ఐకేపీ, డీసీఎంఎస్, పీఏసీఎ స్, వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ని ర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలను మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, హుస్నాబా ద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మిమోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. శంకరపట్నం గన్నేరువ రం మండలంలోని గుండ్లపల్లి, చీమలకుంటపల్లి, జంగపల్లి, గ్రామాల్లో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అందించ డంతోపాటు శంకరపట్నంమండలం కేశవపట్నంలో సర్వాయిపాపన్న విగ్రహం నిర్మాణానికి భూమి పూ జ చేశారు. సైదాపూర్ మండల పరిష త్ కార్యాలయ ంలో ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు అందించారు. జమ్మికుంట తనుగుల, ధర్మారం, మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో మృతిచెందిన రైతుకుటుంబాలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి రైతుబీమా ప్రొసీడింగ్ పత్రాలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించారు.

మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌కు వినతి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

గన్నేరువరం: మండలం నుంచి కరీంనగర్‌కు లోయర్ మానేరు డ్యాంపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ మాజీఎంపీ, రాష్ట్రప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు బుధవారం బ్రిడ్జి సాధన కమిటీ చైర్మన్ సంపతి ఉదయ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో వినతిపత్రం అందించారు. ఎల్ఎండీ నిర్మాణానికి ముందు 9 కిలోమీటర్ల దూరం ఉండేదని, నిర్మాణం తర్వాత 45 కిలోమీటర్లకు దూరం పెరిగిందన్నారు. దీంతో మండల ప్రజలు ఉన్నత విద్యకు దూరం కావడంతో పాటు సకాలంలో వైద్యఅందని పరిస్థితి నెలకొందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం చేపడితే గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండడంతో పాటు హైదరాబాద్‌కు వెళ్లడానికి కరీంనగర్ ప్రజలు, ప్రయాణికులకు దూరం తగ్గుతుందన్నారు మానేరు వాగుపై అనువైన ప్రదేశంలో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పుల్లెల జగన్మోహన్, ప్రధాన కార్యదర్శి పుల్లెల రాము, కోశాధికారి గుండా వెంకటేశం, సహాయ కార్యదర్శి మునిగంటి శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు గర్శకుర్తి ప్రవీణ్, బొడ్డు భాస్కర్, గొల్లపల్లి మల్లేశం, బండారి శ్రీనివాస్, సమ్మెట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అధ్యాపకురాలికి సన్మానం



సన్మానిస్తున్న అధ్యాపకులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కంప్యూటర్ సైన్స్ సహ అధ్యాపకులుగా పనిచేస్తున్న శ్రీరామోజు నాగ పరమేశ్వరాచారి డాక్టరేట్ సాధించినందుకు గాను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, అధ్యాపకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగ పరమేశ్వరిచారి మాట్లాడుతూ.. కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.బి.రమ పర్యవేక్షణలో 'ఎనావెల్ అప్రోచ్ ఆఫ్ క్లాసిఫికేషన్ టెక్నిక్ ఇన్ డాటా మైనింగ్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ కేయూ అందించిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మినరసింహామూర్తి, కళాశాల పూర్వ ప్రధానాచార్యులు గొడిశాల పరమేశ్, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డా.పి.దినకర్, అకాడమిక్ కోఆర్డినేటర్ డా.జి. శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అన్ని మతాలను గౌరవించేది బీఆర్ఎస్



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న పాడి కౌశిక్ రెడ్డి, పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జమ్మికుంట/చొప్పదండి/శంకరపట్నం: రాష్ట్రంలో అన్నిమతాలను,సాంప్రదాయాలను బీఆర్ఎస్ గౌరవిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో మండల తహసీల్దార్ రాజేశ్వరి ఆధ్వర్యంలో స్థానిక సువర్ణ ఫంక్షన్ హాల్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాడి కౌశిక్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ హాజరై మాట్లాడారు. మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలను అన్నివిధాల ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, జెడ్పీటీసీ శ్రీరాంశ్యామ్ ముస్లింలు పాల్గొన్నారు. చొప్పదండి మండలంలోని ముస్లింలకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వ కానుకలు అందించారు. స్థానిక వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, వైస్‌చైర్మన్ చీకట్ల రాజశేఖర్, పీఏసీఎస్ చైర్మన్లు వెల్మ మల్లారెడ్డి, మినుపాల తిరుపతిరావు, తహసీల్దార్ అంబటి రజిత, కోఆప్షన్ సభ్యులు షఫీక్ రహమాన్ పాషా, అజారుద్దీన్, ఖాజాఅలీ, మతపెద్దలు అబీద్, నజీర్, జలీల్, అజీం, జహీరుద్దీన్, పాల్గొన్నారు. శంకరపట్నం మండలంలోని ముస్లింలకు ఎమ్మెల్యే రసమయిబాలకిషన్ ఇఫ్తార్ విందు ఇచ్చారు.

ప్రీస్కూల్ డే

రామడుగు: అంగన్‌వాడీకేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి సూచించారు. వన్నారం గ్రామంలో ప్రీస్కూల్ వేడుకలు నిర్వహించా రు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని కోరారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- తిమ్మాపూర్ బస్టాండ్‌లోకి బస్సులు..!
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు
- బస్టాండ్‌లో అన్నిరకాల ఏర్పాట్లు చేస్తామంటున్న అధికారులు
- తాత్కాలికం కావొద్దంటున్న విద్యార్థులు, ప్రయాణికులు



తిమ్మాపూర్ బస్టాండ్ లోనికి వస్తున్న పల్లె వెలుగు బస్సు

తిమ్మాపూర్: మండలకేంద్రంలో ఎన్నో ఏళ్లుగా వృథాగా ఉంటున్న ఆర్టీసీ బస్టాండ్ ప్రస్తుతం ప్రయాణికులతో కళకళలాడుతోంది. కరీంనగర్ వైపు వెళ్లే పల్లెవెలుగు బస్సులు బస్టాండ్‌లో నిలిచేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. హుస్నాబాద్, బెజ్జంకి, ఇల్లంతకుంట వయా బేగంపేట, కోహెడ నుంచి పల్లెవెలుగు బస్సులు కరీంనగర్‌కు వెళ్లేటప్పుడు తిమ్మాపూర్ బస్టాండ్‌లో నిలుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు,విద్యార్థులకు ఇబ్బందులు తొలిగాయని సంబరపడుతున్నారు. ఇన్నాళ్లూ ఎండలో బస్సుల కోసం నిరీక్షించిన విద్యార్థులు, ప్రయాణికులు ఆర్టీసీ తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కరీంనగర్ నుంచి వెళ్లే బస్సులు సైతం...

కరీంనగర్ నుంచి హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, ఇల్లంతకుంట వెళ్లే బస్సులు సైతం బస్టాండ్‌లో నిలిచేలా చూడాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రెండువైపులా వెళ్లే బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు చేపట్టారు. దీంతో ఆర్టీసీ ప్రాంగణం ప్రయాణికులతో సందడి వాతావరణం నెలకొననుంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలలు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఉండడంతో నిత్యం చాలామంది బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. కొన్నేళ్లుగా బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు రహదారిపై ప్రమాదకరంగా గుమిగూడి ఉండేవారు. బస్టాండ్‌లోకి బస్సులు రావాలని ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదుచేశారు. ఎట్టకేలకు అధికారులు స్పందించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తాత్కాలికం కావొద్దు..

బస్టాండ్‌లోకి బస్సులు రావడం తాత్కాలికం కావొద్దని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో కొన్నిసార్లు మాత్రమే లోపలికి వచ్చేవని, తర్వాత ఎప్పటిలాగే రోడ్డుపైనే నిలిపేవారని అప్పుడు ఎవరూ పట్టించుకోలేదని పలువురు పేర్కొన్నారు. ఈసారి అలా కాకుండా ఎప్పటికీ బస్సులు లోపలికి వచ్చేలా చూడాలని, దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఉండదని కోరుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలని సూచిస్తున్నారు. కేవలం స్థలం కాపాడుకునేందుకు కొన్నిరోజులు నడిపితే ప్రయాణికులకు మాత్రం ఎలాంటి ప్రయోజనం ఉండదని, అంతేకాకుండా బస్టాండ్ ఆవరణలో సీసీ రోడ్డు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సౌకర్యాలు మెరుగుపరుస్తాం



బస్టాండ్‌లోకి ప్రజలు వస్తే బస్టాండ్‌లో అన్నిరకాల ఏర్పాట్లు చేస్తాం. ప్రయాణికులకు సరిపడా కుర్చీలు, ఫ్యాన్లు, టాయిలెట్లు ఇతరత్రా వసతులు కల్పిస్తాం. ప్రయాణికుల సౌకర్యార్థం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నుస్తులాపూర్ వైపు వెళ్లే బస్సులు బస్టాండ్‌లో ఆగేలా చర్యలు తీసుకుంటాం. ఎప్పటికీ బస్సులు బస్టాండ్‌లోకి వస్తాయి, ప్రయాణికులు సహకరించాలి.

– ప్రణీత్, కరీంనగర్– 1 డిపో మేనేజర్